క్లుప్తంగా

జైలు సిబ్బంది ఔదార్యం


ప్రమాదానికి గురై కోలుకున్న వార్డర్ రాజేష్‌కు సాయం అందిస్తున్న జైలు అధికారులు, సిబ్బంది

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారం సిబ్బంది ఆపదలో ఉన్న తోటి ఉద్యోగికి ఆర్థిక సాయం అందించి తమ ఔదార్యం చాటుకున్నారు. బొబ్బిలి సబ్ జైల్‌లో వార్డర్‌గా పని చేస్తున్న జి.రాజేష్ ఇటీవల ద్విచక్ర వాహనంపై భార్యతో కలసి ప్రయాణిస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై విశాఖ హెల్త్ సిటీ పినాకిల్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. వైద్య ఖర్చులు సుమారు రూ.4 లక్షల వరకు అయ్యాయి. రాజేష్ గతంలో విశాఖ కేంద్ర కారాగారంలో వార్డర్‌గా పని చేశారు. కొన్నాళ్ల క్రితం బొబ్బిలి సబ్ జైలుకు బదిలీ అయ్యారు. ప్రమాదం విషయం తెలుసుకున్న విశాఖ కేంద్ర కారాగారంతో పాటు ఈ పరిధిలో ఉన్న శ్రీకాకుళం, విజయనగరం జిల్లా జైళ్లు, సబ్ జైళ్ల సిబ్బంది తలా ఓ చేయి వేశారు. మొత్తం రూ.1.89 లక్షలు సేకరించారు. ఈ నగదును రాజేష్‌కు ఆదివారం విశాఖ కేంద్ర కారాగారంలో పర్యవేక్షణాధికారి ఎస్.కిశోర్‌కుమార్, అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు, డీఎస్‌లు రామచంద్రరావు, కమలాకరరావు, సిబ్బంది అందజేశారు. తనకు ఆర్థిక సహాయం అందించిన అధికారులు, సిబ్బందికి రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ ఫణీంద్రకు ప్రెసిడెంట్ అప్రిసియేషన్ అవార్డ్


అవార్డు అందుకుంటున్న డాక్టర్ కె.ఫణీంద్ర

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీకి చెందిన ప్రముఖ పల్మనాలజీ వైద్యుడు డాక్టర్ ఫణీంద్రకు ప్రతిష్టాత్మక ప్రెసిడెంట్ అప్రిసియేషన్ అవార్డు లభించింది. మంగళగిరిలోని ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 8వ రాష్ట్ర స్థాయిలో సదస్సులో ఆయన ఆదివారం ఈ అవార్డు అందుకున్నారు. కోవిడ్–19 సమయంలో రోగులకు అందించిన విశిష్ట సేవలతో పాటు టీబీ రోగులకు కల్పిస్తున్న అవగాహన సేవలకు గాను ఆయన్ను ఈ అవార్డు వరించింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఆర్.అశోకన్ తదితరులు చేతుల మీదుగా ఈ అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

22వ వార్డులో రాధాకృష్ణుల మహోత్సవాలు

మద్దిలపాలెం : రాధాకృష్ణ మహోత్సవాలను ఆదివారం జీవీఎంసీ 22వ వార్డు రాజీవ్‌నగర్‌లో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణ ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణేష్ యూత్ బృందం సభ్యులు పడాల త్రినాథ్, సంతోష్, శంకర్, వేణుబాబు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కరాటే శిక్షణ ప్రారంభం


ఉచిత కరాటే శిక్షణ ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం : న్యూ రేసపువానిపాలెంలోని జీవీఎంసీ గ్రౌండ్‌లో ఆదివారం ఉచిత కరాటే శిక్షణను సీఐడీ ఎస్ఐ విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కోచ్ సుందరం మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడానికి ఆసక్తిగల చిన్నారులు ముందుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుణలక్ష్మి, రైల్వే సందక రవి, తదితరులు పాల్గొన్నారు.

కూడళ్లు.. కనువిందు

అరిలోవ/ఎంవీపీ కాలనీ: మిరిమిట్లు గొలిపే సెంట్రల్ లైటింగ్, పచ్చదనం, విద్యుత్ కాంతుల మధ్య మెరిసే నీటితుంపరలు.. తదితర ఆధునిక హంగులతో కూడళ్లు కొత్త సొబగులద్దుకుంటున్నాయి. సుందరీకరణ పనులతో నగరానికి ఎంతో ఆకర్షణగా నిలుస్తున్నాయి. తూర్పు నియోజకవర్గంలోని పలు కూడళ్లను అబ్బురపరిచేలా తీర్చిదిద్దుతున్నారు. రూ.కోట్లు వెచ్చించి అందంగా ఆధునికీకరిస్తున్నారు. స్మార్ట్ సిటీని తలపించేలా తూర్పు నియోజకవర్గం పరిధిలో విశాలాక్షినగర్, హనుమంతవాక, ఓల్డ్ డెయిరీఫారం, ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా సర్కిల్, ఉషోదయ జంక్షన్‌లలో సుందరీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 12వ వార్డు పెదగదిలిలో బీఆర్‌టీఎస్ కూడలి ఇప్పటికే ఆధునికీకరణకు నోచుకుని కళకళలాడుతోంది.




కైలాసగిరి కూడలి నమూనా చిత్రం


కైలాసగిరి కూడలిలో జరుగుతున్న పనులు

స్మార్ట్‌గా సుందరీకరణ పనులు
'తూర్పు'లో ముస్తాబవుతున్న జంక్షన్లు

కూడలి	వెచ్చించిన నిధులు
కైలాసగిరి	రూ.76 లక్షలు
హనుమంతవాక	రూ.51.61 లక్షలు
డెయిరీఫారం	రూ.35.65 లక్షలు
పెదగదిలి	రూ.6 లక్షలు
ఉషోదయ సర్కిల్	రూ.36 లక్షలు
ఏఎస్ రాజా సర్కిల్	రూ.1.29 కోట్లు


కొత్త శోభను సంతరించుకున్న ఏఎస్ రాజా సర్కిల్ (ఇన్‌సెట్) ఏఎస్ రాజా సర్కిల్ అభివృద్ధి నమూనా చిత్రం



స్మార్ట్‌గా ఏఎస్ రాజా సర్కిల్

స్మార్ట్‌సిటీ పనుల్లో భాగంగా ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా సర్కిల్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయి. సర్కిల్ చుట్టూ కాబుల్ స్టోన్ ఫ్లోరింగ్ వేస్తున్నారు. సర్కిల్ మధ్యలో ఐల్యాండ్‌ను పూర్తి గ్రానైట్‌తో తీర్చిదిద్దుతున్నారు. సర్కిల్ మధ్యలో ఫౌంటేన్ నిర్మాణం జరగనుంది. దీంతో పాటు ప్లాంటేషన్, బ్యూటిఫికేషన్ పనులు చేపట్టనున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా కైలాసగిరి కూడలి

జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో కైలాసగిరి కూడలిని స్మార్ట్ సిటీలో భాగంగా అధికారులు ఆధునికీకరిస్తున్నారు. ఇందుకు రూ.76 లక్షల నిధులు కేటాయించారు. నగరంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా నిలిచిన కైలాసగిరి కొండపైకి వెళ్లే దారిలో ఈ కూడలి విశాలాక్షినగర్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ జిల్లా కార్యాలయం వద్ద ఉంది. దీంతో పర్యాటకులను ఆకట్టుకొనేలా తీర్చిదిద్దుతున్నారు. వాటర్ ఫౌంటేన్, వివిధ రకాల పూల మొక్కలు, పచ్చదనం, అందమైన మార్బుల్స్, పెయింటింగ్‌తో ప్రత్యేక ఆకర్షణీయంగా ఈ కూడలి నిలవనుంది. ప్రస్తుతం ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ఉషోదయ కూడలి..

ఎంవీపీ కాలనీ ఉషోదయ సర్కిల్ రూ.36 లక్షల నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. సర్కిల్‌లో ఐలాండ్‌తో పాటు వాటర్ ఫౌంటేన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. సర్కిల్‌ను ఆనుకొని ఫుట్‌పాత్, రోడ్డు నిర్మాణం కూడా చేపట్టనున్నారు.


ఉషోదయ సర్కిల్‌లో జరుగుతున్న పనులు


హనుమంతవాక కూడలి నమూనా చిత్రం


ఇటీవల ప్రారంభించిన ఆంజనేయస్వామి విగ్రహం

హనుమంతవాక కూడలి..

జీవీఎంసీ 9వ వార్డు జాతీయ రహదారిపై హనుమంతవాక కూడలిని రూ.51.61 లక్షల నిధులతో ఆధునికీకరిస్తున్నారు. ఇక్కడ ఇప్పటికే ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ప్రారంభోత్సవం కూడా చేశారు. ఇప్పుడు విగ్రహం చుట్టూ పచ్చదనం, పూల మొక్కలు, మధ్యలో మంచు దిమ్మలు, చెట్లకు వేలాడుతున్నట్టు పక్షుల గూళ్లు, వేలాడుతున్న కోతులు, విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా నిర్మిస్తున్నారు.

ఓల్డ్ డెయిరీ ఫారం కూడలి..

జీవీఎంసీ 10వ వార్డు జాతీయ రహదారిపై డెయిరీ ఫారం కూడలిని రూ.35.65 లక్షలతో సుందరీకరణ పనులు చేస్తున్నారు. ఇక్కడ ఇప్పటి వరకు ప్లాట్‌ఫారం మాదిరిగా ఉన్న కూడలికి కొత్తదనం రానుంది. ఈ కూడలి పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి. వాటర్ ఫౌంటేన్‌లో ఆర్చ్ మాదిరిగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఆర్చ్‌పై పలు బొమ్మలు ఏర్పాటు చేయనున్నారు.


డెయిరీఫారం వద్ద జరుగుతున్న కూడలి అభివృద్ధి పనులు

ఆకర్షణీయం.. పెదగదిలి కూడలి

జీవీఎంసీ 12వ వార్డు బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి కూడలిని ఏడాది క్రితం రూ. 6 లక్షలతో అభివృద్ధి చేశారు. విశాలమైన ఈ కూడలి మధ్యలో గతంలో తాగునీటి కోసం నిర్మించిన పెద్ద బావి ఉంది. ఆ బావిపై గ్రిల్స్ వేసి దానిలో నీటిని ఉపయోగించి వాటర్ ఫౌంటేన్ ఏర్పాటు చేశారు. ఇక్కడ రాత్రి వేళ ఐదు రంగులతో నీటిని పైకి విరజిమ్ముతూ ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా ఈ ఫౌంటేన్ కనువిందు చేస్తోంది.


పెదగదిలిలో కూడలిలో వాటర్ ఫౌంటేన్

రాజ్యాంగ స్ఫూర్తితో నడుచుకోవాలి

- ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య సమత
- ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం


అంబేడ్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ ఎంవీవీ, తదితరులు


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించిన ఇన్‌చార్జి వీసీ ఆచార్య సమత, రిజిస్ట్రార్ జేమ్స్‌స్టీఫెన్, తదితరులు


దుప్పట్లు, పండ్లు అందిస్తున్న ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏయూ పరిపాలన భవనం ఎదురుగా ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆచార్య సమతకు రిజిస్ట్రార్‌తో పాటు పలువురు ఆచార్యులు, డీన్‌లు, విభాగాధిపతులు పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్, పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి.సునీత, ఆచార్యులు టి.షారోన్ రాజు, పి.అర్జున్, కె.బసవయ్య, పి.ప్రేమానందం, కె.రమేష్‌బాబు, ఎన్.విజయ మోహన్, బి.మునిస్వామి, జి.వీర్రాజు, ఎన్.ఎం.యుగంధర్, సి.హెచ్ ఆశా ఇమ్మానుయల్ రాజు, కుంజం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కార్యాలయంలో విధులు..

ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య కె.సమత రాజ్యాంగ ఆమోద దినోత్సవం రోజున తన అధికారిక కార్యాలయం నుంచి విధులు నిర్వహించారు. అంబేడ్కర్ ఆలోచనలు, నిర్ణయాలు నేటి తరం మహిళల అభ్యున్నతికి బాటలు వేశాయని వీసీ అన్నారు.

బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో..

భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత ముఖ్యఅతిథిగా హాజరై కళాశాలలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం విద్యార్థులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. యువత రాజ్యాంగ స్ఫూర్తితో నడుచుకోవాలని సూచించారు. న్యాయ కళాశాల విద్యార్థులు భారత రాజ్యాంగ ప్రాధాన్యతను తెలియజేస్తూ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి న్యాయమూర్తి ఎం.శేషమ్మ, ఆచార్య కె.సీతామాణిక్యం, డాక్టర్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ: విశాఖ ప్రభుత్వ మహిళ కళాశాల ఎన్‌సీసీ యూనిట్ విద్యార్థుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంవీపీ కాలనీ, మద్దిలపాలెంతో పాటు నగరంలోని పలు చోట్ల అనాథలకు, యాచకులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఎంవీపీలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి, కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ గీతాంజలి, అధ్యాపకురాలు వహిద, విద్యార్థులు పాల్గొన్నారు.

- ఎంవీపీ కాలనీ శాఖా గ్రంథాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి లైబ్రేరియన్ ఉమామహేశ్వరరావు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు.

రాజ్యాంగ స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

ఎంవీపీ కాలనీ: రాజ్యాంగ స్ఫూర్తిప్రదాత డాక్టర్ అంబేడ్కర్ అని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని లాసన్స్‌బే కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఎంవీవీ నివాళులర్పించారు.

ఉత్సాహంగా ర్యాలీ

బీచ్ రోడ్డు: రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ఆదివారం భీమ్ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో యువతీ, యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భీమ్ సేన వ్యవస్థాపకుడు రవి సిద్ధార్థ మాట్లాడుతూ ప్రజల్లో భారత రాజ్యాంగం ఆవశ్యకతను తెలియజేసేందుకు ప్రతి ఏటా ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు.

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.సుజాత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు చేసిన విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. అలాగే డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు.

ఎఫ్‌సీఐలో..

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఐ)లో ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ అధ్యాపకులు, విద్యార్థులు కలసి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారత రాజ్యాంగాన్ని కాపాడుతామని, బాధ్యతాయుతంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యురాలు రహీమున్నీషా బేగం, ఎఫ్‌సీఐ ప్రిన్సిపాల్ కె.వి.రమణ, అధ్యాపకులు రవి, పార్థసారధి పాల్గొన్నారు.


బీచ్ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న యువతీ యువకులు


కృష్ణా జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ బి.సుజాత, తదితరులు

ముగిసిన అయ్యప్ప మహా సంగమం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానం వేదికగా రెండు రోజులుగా జరుగుతున్న అయ్యప్ప మహా సంగమం ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిసింది. విశాఖ భక్తజనం పులకించేలా పూర్ణ పుష్కల అయ్యప్పసేవా ట్రస్ట్, అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. పెద్దసంఖ్యలో అయ్యప్ప స్వాములు, నగరవాసులు పాల్గొని భక్తిపారవశ్యంతో పులకించారు. ఆదివారం సాయంత్రం శ్రీ మహాగణపతి హోమం నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వామి ప్రధానమూర్తులకు అష్టాభిషేకం, పంచామృతాభిషేకాలను జరిపారు. త్రికాల అయ్యప్పపూజ, త్రికాల భగవతి పూజ నిర్వహించారు. ఉదయం సంతాన ప్రాప్తికోసం సంతాన గోపాల హోమం జరిపించారు. కార్యక్రమంలో శ్రీ పూర్ణ పుష్కల ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పైలా ఆదిమోహన్ రెడ్డి, అఖిల భారతీయ అయ్యప్ప ప్రచార సభ అధ్యక్షుడు అయ్యప్ప దాస్, రాష్ట్ర అధ్యక్షుడు బెల్లపు హరి ప్రసాద్, అయ్యప్ప మహా సంగమం పూజా కోర్ కమిటీ చైర్మన్ ఎం.కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు ధర్మాల శ్రీనివాసరెడ్డి, పూజా కమిటీ చైర్మన్ ఆదిమూలపు నాగరాజు, ట్రస్ట్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎం.ప్రకాష్ పాల్గొన్నారు. మైదానంలో ఏర్పాటు చేసిన వేదిక అందరినీ ఆకట్టుకుంది. ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసి ప్రత్యక్ష ప్రసారం చేశారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్, నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు.. అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు.


అయ్యప్పఆలయం తలపిస్తున్న మండపం


బీచ్ రోడ్డులో ఆదివారం జరిగిన రాధాకృష్ణుల మహోత్సవంలో వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వెంకటరావు దంపతులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

నిరుద్యోగులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

మద్దిలపాలెం : పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు రామ్‌కీ ఫౌండేషన్ బాసటగా నిలవడం ఆదర్శనీయమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. దేశ వ్యాప్తంగా కానిస్టేబుల్ భర్తీకి నోటిఫికేషన్ రావడంతో రామ్‌కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతుల కోసం అభ్యర్థుల ఎంపిక పరీక్షను ఆదివారం చైతన్యనగర్‌లో ఓ స్కూల్ నిర్వహించారు. ఈ సందర్భంగా గొండు సీతారాంతో పాటు రామ్‌కీ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ గిరిధర్ భక్షి, రీజనల్ హెడ్ కె.శ్రీకాంత్ చేతుల మీదుగా మెటీరియల్ అందజేశారు. వచ్చే నెల 2 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.


కానిస్టేబుల్ అభ్యర్థులకు మెటీరియల్ అందిస్తున్న గొండు సీతారాం

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు

ఏయూ క్యాంపస్: కార్తీక పౌర్ణమిని భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. 20వ వార్డులోని శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. ఏయూ అవుట్‌గేట్ వద్దనున్న లలితా సుందరేశ్వర పీఠంలో లలితా సహస్ర నామ పారాయణ, శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. పెదవాల్తేరు, చినవాల్తేరులోని శివాలయాల వద్ద జ్వాలాతోరణాలు ఏర్పాటు చేశారు. మహిళలు ఉపవాసాలు ఉండి పౌర్ణమి వ్రతాలు, పూజలు జరిపారు. ఆలయాల వద్ద 365 ఒత్తులతో కూడిన దీపాలను పెద్ద సంఖ్యలో మహిళలు వెలిగించారు.


లలిత పీఠంలో పూజలు అందుకున్న అమ్మవారు

ఆరిలోవ: చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో కార్తీక పౌర్ణమి పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం జ్వాలా తోరణం నిర్వహించారు. అనంతరం శివ పార్వతుల ప్రతిమలను ఊరేగించారు.


చినగదిలి సాయిబాబా ఆలయంలో జ్వాలా తోరణంలో భక్తులు